మాఫీ మాయలు

# 'సహకారం'లోనూ సర్కారు కొర్రీలు

## మూడోవంతు మంది రైతులకే రుణమాఫీ

- కొన్ని సొసైటీల్లో ఐదోవంతు మందికి మాత్రమే లబ్ధి
- అయోమయంలో విండో పాలకవర్గాలు, రైతులు
- రుణమాఫీపై వివరణ ఇచ్చే అధికారులు కరువు
- అసహనం వ్యక్తంచేస్తున్న రైతాంగం

మరికొన్ని సొసైటీల్లో రుణమాఫీ ఇలా..

| సొసైటీ పేరు | రూ.లక్ష రుణం తీసుకున్నవారు | రుణమాఫీ పొందినవారు | రుణమాఫీ కాని రైతుల సంఖ్య |
|---|---|---|---|
| కోటగిరి | 219 | 59 | 160 |
| కొత్తపలి | 521 | 153 | 368 |
| రాయకూర్ | 376 | 119 | 257 |

బోధన్, జూలై 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన లక్షలోపు రుణమాఫీ ప్రక్రియ గందరగోళంగా మారింది. గ్రామాల్లో ఇప్పటికీ రుణమాఫీపై రైతుల్లో అయోమయం నెలకొన్నది. ఎవరెవరికి రుణమాఫీ అయ్యింది.. ప్రభుత్వ నిబంధనల ప్రకారంలో అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ ఎందుకు జరగలేదు..కొందరికి రుణమాఫీ జాబితాలో పేరు ఉన్నా ఖాతాలో డబ్బులు జమకాకపోవడం తదితర అంశాలపై సందిగ్ధత నెలకొన్నది. బ్యాంకుల్లో రూ.లక్ష వరకు రుణమాఫీ అర్హులందరికీ అమలుకాకపోగా.. రైతు నేస్తాలుగా పేరొందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణమాఫీ ప్రక్రియ గందరగోళంగా మారింది. సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల్లో రూ.లక్ష వరకు రుణం పొందినవారిలో మూడో వంతు మందికి కూడా రుణమాఫీ జరగలేదని తేలిపోయింది. జిల్లాలోని ప్రతి సహకార సంఘంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. దీంతో రూ.లక్ష వరకు రుణమాఫీ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 18న ఎంతో అర్భాటంగా చేసిన ప్రకటనకు, సహకార సంఘాలకు అందిన రుణమాఫీ జాబితాలకు పొంతనలేకుండా పోయింది.

సొసైటీల్లో మూడో వంతు మందికి కూడా రుణమాఫీ లబ్ధి అందలేదు. కొన్ని సొసైటీల్లో నైతే ఐదో వంతు మందికి కూడా రుణమాఫీ జరగలేదు. ఎన్నికలకు ముందు రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ భారం నుంచి తప్పించుకునేందుకు అనేక షరతులు విధించింది. రేషన్ కార్డు కావాలని, కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేస్తామంటూ కొర్రీలు, కోతలు పెట్టడంతో ఆచరణలో అర్హులైన రైతులకు రుణమాఫీ అందలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు జోరుగా వర్షాలు కురుస్తుండడంతో, ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు ఈ రుణమాఫీ వ్యవహారం ఆందోళనను కలిగిస్తున్నది.. పనులు మానేసి బ్యాంకులు, సహకార సంఘాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ వారికి ఎటువంటి సమాధానం దొరకడంలేదు. తమకేమీ తెలియదని, పైనుంచే రుణమాఫీ జాబితాలను పంపారంటూ సహకార సంఘాల సిబ్బంది సమాధానమిస్తున్నారు. ఆయా సొసైటీల పాలకవర్గాలు సైతం రుణమాఫీ వ్యవహారంపై విస్తుపోతున్నారు. రుణమాఫీ అమల్లోకి వచ్చి నాలుగు రోజులవుతున్నప్పటికీ స్పష్టత లేకపోవడంతో.. గ్రామాల్లోని చోటా, మోటా కాంగ్రెస్ నాయకులు ముఖం చాటేయడం ప్రారంభించారు. గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రెండుసార్లు చేసిన రుణమాఫీతో అర్హులందరికీ లబ్ధి చేకూరిన విషయమై ఇప్పుడు పల్లెల్లో చర్చించుకుంటున్నారు.

### రేషన్ కార్డుల కొర్రీతోనే..

రుణమాఫీకి రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోబోమని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు చెబుతున్నప్పటికీ, ఇప్పటికే ఆధార్‌తో లింకైన రేషన్ కార్డులను తీసుకోవడంతో అనేక మంది రైతులు రుణమాఫీకి అనర్హులైనట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి కుటుంబాలు పెద్దవై విడిపోయినప్పటికీ, ఇప్పటికీ ఒకే రేషన్ కార్డు మీద అందరి పేర్లు ఉన్నాయి. చాలామంది రేషన్ కార్డుల్లో మార్పులు చేసుకోలేదు. గతంలో కేసీఆర్ రుణమాఫీకి కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీకి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడంతోనే రైతులు పెద్ద సంఖ్యలో రుణమాఫీకి నోచుకోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఎడపల్లిలో ఐదో వంతు.. పొతంగల్‌లో నాల్గోవంతు మందికే..

ఎడపల్లి సొసైటీలో ఐదో వంతు మందికే రుణమాఫీ జరిగింది. ఈ సంఘంలో రూ.లక్ష రుణాలు పొందినవారు 202 మంది రైతులు ఉండగా, ప్రస్తుతం వారిలో 43 మందికే రుణమాఫీ జరిగింది. రాష్ట్రంలోని ఆదర్శ సహకార సంఘాల్లో ఒకటైన పొతంగల్ విశాల సహకార సంఘంలో అర్హులైన రైతులు 407 మంది ఉండగా, వారిలో కేవలం 98 మంది రైతులకే రుణమాఫీ కావడం గమనార్హం.

### జాన్కంపేట్, సాలూర సహకార సంఘాల్లోనూ..

ఎడపల్లి మండలం జాన్కంపేట్ సొసైటీలో సగం మందికే రుణమాఫీ జరిగింది. ఈ సొసైటీలో 330 మంది రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకోగా, వారిలో 159 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. సాలూర సొసైటీలో మొత్తం 564 మంది రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకోగా, వీరిలో కేవలం 199 మందికి మాత్రమే మాఫీ జరిగింది.






### వచ్చి వాపస్ పోయినయంట..

నాకు 1.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కోటగిరి ఎస్‌బీఐలో పంట రుణం కోసం మూడేండ్ల క్రితం రూ.65 వేలు రుణం తీసుకున్న. రుణమాఫీ జాబితాలో రూ. 92,493 మాఫీ అయినట్లు బ్యాంకు బయట గోడకు పెట్టిన జాబితాలో నా పేరు ఉంది. కానీ బ్యాంకులో అధికారులకు అడిగితే వచ్చినయ్ కానీ మళ్లీ వాపస్ పోయినాయని సమాధానం చెబుతున్నారు. నాకేం అర్థం కావడం లేదు.. దీనిపై ఎవరిని అడిగినా వివరాలు చెప్పట్లేదు. రూ.లక్షలోపు రుణం ఉన్న ప్రతి ఒక్కరికీ మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. నా రుణం మాఫీ అవుతుందా.? లేదా? అనేది అర్థం కావడం లేదు.

**-బట్టు సాయిలు, రైతు, కోటగిరి**



### అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు..

మేము సాలూర సొసైటీలో రూ.80 వేలు రుణం తీసుకున్నాం.. ఇప్పటివరకు రైతు భరోసా రాలేదు. కనీసం రుణమాఫీ జరుగుతుందని ఆశించాం. కానీ అర్హుల జాబితాలో నా పేరు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఒక వేళ బ్యాంక్‌లో మా పేరిట రుణం తీసుకున్నామా అంటే.. రెండేండ్ల కిందటే బ్యాంక్ రుణం తీర్చేశాం.. సొసైటీలోనే రూ.80 వేలు తీసుకున్నాం.. ఇప్పుడా రుణం కూడా ఎందుకు మాఫీ కాలేదు.. ఇలాగైతే ఎలా.. మాఫీ జరిగివుంటే.. మళ్లీ రుణం తీసుకునేవాళ్లం.. పెట్టుబడులకు పనికివచ్చేది.. రుణమాఫీ జరగకపోవడానికి అధికారులు కారణం చెప్పాలి..

**-ముట్టెన్ గంగారాం, రైతు, సాలూర**



### 'ఏం అర్థం కావడంలేదు..



కోటగిరి, జూలై 21: నా పేరిట 25 గుంటల వ్యవసాయ భూమి కోటగిరి శివారులో ఉంది. నేను 2019లో కోటగిరి సింగిల్ విండో ద్వారా రూ.23 వేలు వ్యవసాయ పంట రుణం తీసుకున్న.. అయితే గురువారం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. దీని గురించి పలుమార్లు అధికారులు, సిబ్బందికి అడిగితే మాఫీ రాలేదని చెబుతున్నరు. ప్రభుత్వమేమో లక్ష లోపు రుణాలు తీసుకున్న వారందరికీ మాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ రుణమాఫీలో మాత్రం నా పేరు రాలేదు. మరి నా పరిస్థితి ఏమిటనేది అర్థం కావడం లేదు. మళ్లీ అప్పు తెచ్చి వ్యవసాయం చేసుకోవాల్సిందేనా..

**- పొమ్మెడి సుజాత, మహిళా రైతు, కోటగిరి**

# అడ్డుకుంటే దాడులు చేస్తారా!



- బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి హేయమైన చర్య
- ప్రజాపాలన అంటే హత్యాయత్నాలకు పాల్పడడమా?
- అరాచకాలకు పాల్పడే కాంగ్రెస్ నేతలను ప్రశ్నిస్తాం..
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, జూలై 21: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని బెజ్జోరాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకుల దాడిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఖండించారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రశ్నించినందుకు హత్యాయత్నానికి పాల్పడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కండ్ల ముందు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుంటే ఒక బాధ్యత గల పౌరుడిగా బీఆర్ఎస్ కార్యకర్త మహేందర్ ప్రశ్నించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడం, అతడిని చంపాలని చూడడమేనా ప్రజాపాలనా అని ప్రశ్నించారు. రోజురోజుకూ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు పెరుగుతున్నాయని, ఇష్టారీతిన ఇసుక అక్రమ రవాణా దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, అక్రమ సంపాదనతో కాంగ్రెస్ పార్టీ నాయకులు జేబులు నింపుకొంటున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు ఇసుక మాఫియాతో చేతులు కలిపి డబ్బులు పంచుకుంటున్నారని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. దాడి చేసిన వారిని చట్టప్రకారం హత్యాయత్నం కింద రిమాండ్ తరలించాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలు, అరాచకాలు చేసే కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నిస్తామని, వెంటాడుతామని, ప్రజాకోర్టులో నిలబెడుతామని పేర్కొన్నారు. ప్రశ్నించిన తమ పార్టీ కార్యర్తలపై అధికార మదంతో దాడులు చేస్తే అదే రీతిలో సమాధానం చెబుతామని వేముల హెచ్చరించారు.

## మంచం పట్టిన బోర్లం క్యాంపు

కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్న గ్రామస్తులు

-వివరాలు 8లో..

# విస్తారంగా వర్షాలు


- ఉమ్మడి జిల్లాలో చెరువులు, వాగులకు జలకళ
- నీట మునిగిన పంట పొలాలు
- పలుచోట్ల కూలిపోయిన నివాస గృహాలు
- కామారెడ్డి జిల్లాలో 39.7 మి.మీ., నిజామాబాద్‌లో 88.1 మి.మీ నమోదు



నవీపేట మండలం జన్నేపల్లి శివారులో పంట పొలాల్లోకి చేరిన వర్షపునీరు



కామారెడ్డిలోని 47వ వార్డులో కూలిన ఇల్లు



మోర్తాడ్ మండలం గాండ్లపేట్ శివారులో నీటమునిగిన పంటలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూలై 21: ఉమ్మడి జిల్లాలో రెండురోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు మండలాల్లో చెరువులు, వాగులు జలకళను సంతరించుకుంటున్నాయి. పలు గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పొంగి పొర్లుతున్నాయి. శని,ఆదివారాల్లో కురిసిన వర్షానికి మోర్తాడ్, ధర్మోరా మొండివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గాండ్లపేట్ శివారులో వరదకాలువ పక్కన పంటలు నీటమునిగాయి. నవీపేట మండలంలోని జన్నేపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద ఉధృతికి జన్నేపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాల్లోకి వర్షపునీరు చేరింది.

### త్రివేణి సంగమ క్షేత్రం వద్ద ..

రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి నది నిండుగా పారుతున్నది. మహారాష్ట్ర నుంచి వస్తున్న వదరతో త్రివేణి సంగమ క్షేత్ర ప్రదేశం వద్ద గోదారమ్మ పరుగులు తీస్తోంది. ఆదివారం మొదటిసారిగా హరిద్రా, మంజీరా,గోదావరి నదులు సమానంగా ప్రవహిస్తుండడం విశేషం.

### కూలిన ఇండ్లు

భారీ వర్షాలకు నవీపేట మండలంలోని ఫత్తేనగర్, కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని బోనాల్ తండా, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 47 వార్డులో ఇండ్లు కూలిపోయాయి.

### ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూలై 21: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చి చేరుతోంది. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 18,518 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా, మధ్యాహ్నం మూడు గంటలకు 1067. 50 అడుగులు (19.380 టీఎంసీల) నీటినిల్వ ఉన్నది. మొత్తం అవుట్‌ఫ్లో 503 క్యూసెక్కులు కొనసాగుతున్నది. సరస్వతీకాలువకు 10క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 262 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 39.7 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా ఎల్లారెడ్డిలో 19.5 మి.మీ, అత్యల్పంగా జుక్కల్, డోంగ్లీలో 0.5 మి.మీ. నమోదైంది. నిజామాబాద్‌లో 88.1 మి.మీ, కమ్మర్‌పల్లిలో అత్యధికంగా 25. 8 మి.మీ, ఆలూర్‌లో 7.0 మి.మీ నమోదైంది.

# గురువును మించిన దైవం లేదు

సుభాష్‌నగర్, జూలై 21: హైందవ సంప్రదాయంలో గురువుకు విశిష్ట స్థానం ఉన్నదని, గురువును మించిన దైవం లేదని గురుపరంపరను కొనసాగించాలని ప్రముఖ కవి, ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంతి ఆచార్యులు డాక్టర్ మేడవరం అనంతకుమారశర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో శ్రీవిద్యా గణపతి సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో గురుపూర్ణిమ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గణపతి అశోకశర్మ వారి గురువైన డాక్టర్ మేడవరం అనంతకుమారశర్మను ఘనంగా సత్కరించారు. వేడుకలో భాగంగా మేడవరం రామస్వామి శాస్త్రి, శాప గంగాధర్, చిప్పల లక్ష్మీకాంత్‌శర్మ, వీపీ చందన్‌రావు, జిమ్మగారి ఉపేంద్రశర్మ, ఒరుగంటి విఠలాచార్య, కప్పకంటి సత్యానంద శర్మ, డాక్టర్ గోపీకృష్ణ, చాడశ్రీ కరుణ కృష్ణరావు, చిత్కల లక్ష్మీకాంత్ శర్మ, చిత్కల శ్రీనివాస్ శర్మ, డా. బి. స్వప్నను జీవన సాఫల్య పురస్కారాలతో సన్మానించారు. కాసర్ల నరేశ్‌రావు, శ్రీకాంత్, రాఘవాచార్య, తల్లవఝుల మహేశ్‌బాబు, అయాచితం నాగరాజుశర్మ, సముద్రాల రాములు, సాయిప్రసాద్‌కు కవిపండిత కళా సత్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గురుపౌర్ణిమ ప్రాముఖ్యతపై వక్తలు ప్రసంగించారు.అనంతరం కాళేశ్వర శతకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు.



కాళేశ్వర శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు







మండలంలోని పోచారం ప్రాజెక్టు గతేడాది జలకళ సంతరించుకోగా.. ఈ ఏడాది వెలవెలబోతున్నది. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో జూలై 21న ప్రాజెక్టు పొంగిపొర్లగా.. నేడు పరిస్థితి ఇందుకుభిన్నంగా మారింది. గతేడాది జూలై 19, 20వ తేదీల్లో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు గాంధారి, లింగంపేట పెద్దవాగు, గుండారం నల్లవాగు ద్వారా వరద వచ్చి చేరగా జూలై 21న ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి దిగువకు పొంగిపొర్లింది. దీంతో రెండు పంటలు పండడంతో రైతు కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురుస్తున్నా ఇప్పటివరకు చుక్క నీరు రాలేదు. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఇప్పటివరకు పంటలు వేయలేక అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనదని, ప్రాజెక్టు ఎప్పుడు నిండుతుందోనని పంటలు సాగు చేసుకోవడానికి రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

–నాగిరెడ్డిపేట, జూలై 21